క్లుప్తంగా

పరామర్శ



నీలంనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోదరుడు, మండల కేంద్రానికి చెందిన నీలంనాయుడు ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. నీలంనాయుడు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, మామిడి జగన్నాథంనాయుడు, కిమిడి అచ్చిబాబు, కిమిడి సూరప్పనాయుడు, అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, గుళ్లపాడు మాజీ సర్పంచ్ ముంజేటి కిశోర్‌కుమార్, ఉంగరాడ వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు శ్రీనివాసరావు, తదితరులున్నారు.

భక్తులకు గుడ్డసంచుల పంపిణీ



భక్తులకు గుడ్డసంచులు పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని శ్రీ అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక మంటపంలో పూజలకు వచ్చిన భక్తులకు పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు శనివారం గుడ్డసంచులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. మొక్కల పెంపకంతోపాటు ప్లాస్టిక్ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై దృష్టిసారించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు కొత్తా మధుసూదనరావు, కాశీనాయుడు, శాంతి, శౌరీష్, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను రవాణా చేస్తే చర్యలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: ఆటోల్లో మద్యం,గంజాయి, ఖైనీ,గుట్కా వంటి మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు.స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ వి.ప్రసాదరావుతో కలిసి ఆటో డ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, వాహన చట్టాలపై అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కొంతమంది ఆటో డ్రైవర్లు మద్యంతో పాటు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతు న్నారని తమ దృష్టికి వచ్చిందని,పట్టుబడితే జైలు శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు.

సచివాలయాన్ని సందర్శించిన పీఆర్ కమిషనర్



సచివాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న రాష్ట్ర పీఆర్ కమిషనర్ కృష్ణతేజ

తెర్లాం: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ జిల్లాలో శనివారం చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఎం.ఆర్ అగ్రహారం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలోకి వచ్చిన వెంటనే పంచాయతీ కార్యదర్శిని ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి స్వర్ణ పంచాయతీ యాప్‌ను ఓపెన్ చేయాలని కమిషనర్ ఆదేశించారు.పంచాయతీ కార్యదర్శి యాప్‌ను ఓపెన్ చేయలేకపోవడంతో వెంటనే ఆయన అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లిపోయా రు. ఆయన వెంట జిల్లా అధికారులు, ఎంపీడీ ఓ రేగి రాంబాబు, ఈఓపీఆర్‌డీ నీలిమ, సర్పంచ్ ప్రతినిధి లొట్టి వెంకటరావు, తదితరులున్నారు.

ప్లాస్టిక్ నిషేధం ఒట్టి మాటే..!

- పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ విచ్చలవిడిగా పాలిథిన్ సంచుల వినియోగం
- మురుగుకాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- తూతూ మంత్రంగా తనిఖీలు



సంతకవిటి మండలం మోదుగులపేటలోని సాగునీటి చెరువులో పాలిథిన్ వ్యర్థాలు



రాజాం పట్టణంలో మల్లికార్జునకాలనీలోని మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు



కంచరాంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: పర్యావరణానికి ప్లాస్టిక్ పెనుభూతంగా మారింది. మార్కెట్లో, కిరాణా దుకాణాల్లో ఏ చిన్న వస్తువు లను కొనుగోలు చేసినా వాటిని ప్లాస్టిక్ కవర్లలోనే ఇళ్లకు తీసుకువెళుతున్నారు. ఏది అవసరమైనా పాలిథిన్ సంచుల్లోనే తెచ్చుకుంటున్నారు. చివరకు టీ, కాఫీ తీసుకువెళ్లేందుకు కూడా పాలిథిన్ సంచులనే వినియోగి స్తున్నారు.పాలిథిన్ సంచులు లేనిదే ఏ సరకులూ తెచ్చుకోలేని విధంగా పరిస్థితి తయారైంది. నిన్న, మొన్న టి వరకు పట్టణాల్లోనే అత్యధికంగా ఉన్న ప్లాస్టిక్ వినియోగం ఇప్పుడు గ్రామాల్లో కూడా పెరిగిపోయింది. మురుగు కాలువల్లో, రోడ్ల వెంబడి ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. పాలిథిన్ సంచుల వినియోగం మితిమీరడంతో గ్రామీణ ప్రాంతాల్లో వాటి వ్యర్థాలు ఎక్కడికక్కడ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. వీటిని వినియో గిస్తు న్న ప్రజలు, వ్యాపారస్తులు వీధుల్లో, రోడ్లపై విసిరేస్తుండడంతో ఇవి నేరుగా మురుగుకాలువల్లో చేరి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయి. ఫలితంగా మురుగు నీరు రోడ్లమీద పారుతోంది.పలుచోట్ల పంటపొలాల్లోకి వ్యాపించి భూమిలోకి చేరి కాలుష్య కారకంగా మారుతున్నాయి. నియోజకవర్గంలో రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల్లోని 123 పంచాయతీల్లోనూ ఈ సమస్య ఉంది. వీటి వినియోగంతో భూగర్భ జలాలు కలుషితమవ్వడం వల్ల ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. 40 మైక్రాన్లు కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ సంచుల ఉత్పత్తిని, వినియోగాన్ని అరికట్టాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. నియోజకవర్గంలో ప్రతీ నెల 20 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలు సేకరిస్తున్నారని సమాచారం. ఇవి కాకుండా టన్నులకొలదీ వ్యర్థాలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. నిషేధిత పాలిథిన్ సంచుల వినియోగాన్ని అరికట్టేందుకు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఏదో తూతూ మంత్రంగా చేపడుతున్నారనే విమర్శలు పర్యావరణ ప్రేమికుల నుంచి వినిపిస్తున్నాయి. ఎక్కడా ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలవుతున్న దాఖలాలు లేవు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదు. అధికారులు పట్టించుకోవడంలేదు. సచివాలయ ఉద్యోగులకు వీటి నిషేధంపై పట్టడంలేదు. విచ్చలవిడిగా పాలిథిన్ సంచులను వినియోగిస్తున్నారు. రోజూ క్లాప్ మిత్రలు గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తలో ఇవే ఎక్కువగా ఉంటున్నాయి.
– వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్, అంతకాపల్లి, రేగిడి మండలం

మూగజీవాలు చనిపోతున్నాయి



ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. వీటిని ఎక్కడపడితే అక్కడే పడేస్తుండడంతో మూగజీవాలు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి. వరద నీటితో ఈప్లాస్టిక్ వ్యర్థాలు పొలాల్లోకి చేరి పంటలపై కూడా ప్రభావం చూపిస్తున్నాయి.
–కరణం శ్రీనివాసరావు, మజ్జిరాముడుపేట, రేగిడి మండలం

చర్యలు తీసుకుంటున్నాం



పాలిథిన్ సంచులు వినియోగించవద్దని అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో సేకరించే చెత్తలో ఇవే ఎక్కువగా ఉంటున్నాయి. వీటిని క్లాప్ మిత్రలు చెత్త నుంచి సంపదతయారీ కేంద్రాలకు తరలించి, వాటిని చెత్తనుంచి వేరు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు షాపుల్లో తనిఖీలు చేయాలని చెప్పాం. పాలిథిన్ సంచుల నియంత్రణకు కట్టుదిట్టమైప చర్యలు తీసుకుంటాం.
–వి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ,రాజాం

అక్రమ తాగునీటి కనెక్షన్లను క్రమబద్ధీకరించండి



మున్సిపల్ డీఈ కిరణ్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గోవిందరావు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలో వందలాది అక్రమ తాగునీటి కనెక్షన్లు ఉన్నాయని,వాటిని క్రమబద్ధీకరించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుందని,అధికారులు ఎందుకు దృష్టిసారించడం లేదని కౌన్సిలర్లు ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ తమ వార్డులో సుమారు 250 మంది వినియోగదారులు అక్రమంగా తాటునీటి కనెక్షన్లను పొందారని వాటిని క్రమబద్ధీకరించాలని మున్సిపల్ అధికారులకు పదేపదే చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలోని 31వార్డుల్లోను అక్రమ కనెక్షన్లు ఉన్నాయని మిగిలిన కౌన్సిలర్లు సమా వేశంలో ప్రస్తావించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి స్పందిస్తూ ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన జీఓ ద్వారా క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డుల్లో అభివృద్ధి పనులు మంజూరు కాగా, వాటిని కౌన్సిలర్లకు తెలియకుండా రద్దుచేయడంలో ఆంతర్యమేమిటని, మల్లంపేటలో రోడ్డు,కాలువల పనులను తనకు తెలియకుండా ఎలా రద్దుచేశారో చెప్పాలని కౌన్సిలర్ ఇంటి గోవిందరావు డీఈ కిరణ్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగారు. దీంతో కాస్త గందరగోళం జరిగింది. డీఈ వివరణతో సంతృప్తి చెందని కౌన్సిలర్ వచ్చే సమావేశాలకైనా మరలా వార్డులో పనులు ప్రారంభం కావాలని డిమాండ్ చేశారు.పట్టణంలో మెయిన్‌రోడ్డు,బజారులో ఇరుకుగా ఉన్న రహదారిపై తోపుడు బళ్లతో వ్యాపారాలు కొనసాగించేవారితో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అత్యవసర సమయాల్లో 108,ఫైర్ సర్వీసు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని తొలగించాలని పలువురు కౌన్సిలర్లు కోరగా.. పోలీసుల సహకారంతో వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. కొంతమంది కౌన్సిలర్లు అడ్డుతగడంతో ఇన్నాళ్లుగా ఆక్రమణలు తొలగించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కౌన్సిలర్లంతా హామీ ఇస్తే తప్పక తొలగిస్తామని చెప్పారు.అనంతరం అజెండాలోని పలు అంశాలపై చర్చించి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. వార్డు కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 7,8న సీఐటీయూ మహాసభలు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజాం సిటీ: సీఐటీయూ 11వ జిల్లా మహాసభలు రాజాం కేంద్రంగా సెప్టెంబర్ 7, 8వ తేదీల్లో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమేష్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్ ఆవరణలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి సీఐటీయూ అలుపెరుగని పోరా టం చేస్తోందన్నారు.కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్స్‌పై, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మికుల కనీసవేతనాలు, రిటైర్మెంట్ సదుపా యాలు, తదితర అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు ఉద్యోగులు, కార్మికుల అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఐ.జగన్‌మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు ఎం.త్రినాథ్, కె.అశిరప్పడు, కనకరాజు, సీహెచ్.ఉమ, జి.దుర్గారావు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది



విలేకరులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే వారిపై పోలీసులను ప్రయోగించి అక్రమ అరెస్టులతో కక్షతీర్చుకుంటున్నారని, కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని,రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఆరోపించారు. పట్టణంలోని ఉత్తరాంధ్ర సాధన సమితి కార్యాలయంలో శనివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిపై టీడీపీ రౌడీ మూకలు దాడిచేస్తే ఆయనను పరామర్శించేందుకు వెళ్లినందుకు మాజీ మంత్రి పేర్నినానిపై కేసుపెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు.అనంతపురంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేను తన స్వగ్రామానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారందరిపై కేసులు పెడుతూ ఆనందపడుతున్న కూటమి నేతలకు శిక్షతప్పదని, రెడ్‌బుక్ పాలనను వదిలి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు జరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర సాధన సమితి సభ్యులు ఎస్.అప్పారావు,వి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: బాల్య వివాహాలు నేరమని స్థానిక కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. మున్సిపాలిటీ పరిధి తిమ్మయ్యపేటలో శనివారం న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, కౌమారగర్భం, వాటి దుష్పరిణామాలను వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా అంటరానితనం, కులవివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా అమలుచేస్తున్న చట్టాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. చట్టాలను దుర్వినియోగం చేయకూడదని, చట్టం ముందు అంతా సమానులేనని అన్నారు. విద్య ప్రాముఖ్యత తెలుసుకుని మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని తెలిపారు. షెడ్యూల్ తెగలు తమ హక్కులకు ఉల్లంఘన జరిగితే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని చెప్పారు. తిమ్మయ్యపేట గ్రామాన్ని దత్తత తీసుకున్న ఎన్‌జీఓ సప్పటి వసంతరావును అభినందించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్, రాజాం కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, ఆర్.ఈ.సీహెచ్.జయదేవ్, ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్, ఎస్‌ఐ కె.శేఖర్‌రావు, ప్రభావతి జాగృతి సంస్థ అధ్యక్షుడు సప్పటి వసంతరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పి.చైతన్య, గట్టి పాపారావు, టి.టి.వి. రమణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- 'బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి



29వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న శంబంగి

బొబ్బిలి: ప్రజలను ఉద్ధరిస్తామని చెప్పి ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తోపాటు వందలాది హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని,సూపర్‌సిక్స్ తప్ప వేరే ఏ హామీలు ఇవ్వనట్లు అబద్ధాలు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు విమర్శించారు. మున్సిపాలిటీ లోని 29వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలతో కలిసి శనివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్ర మం నిర్వహించారు.చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఇచ్చిన బాండ్లను చూపించి ఇవి అమలయ్యాయా,ఈ పథకాలు అందాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శంబంగి మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధికి రుణాలిస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామన్న పెద్దమనిషి వాటికి ఎగనామం పెట్టాడని గుర్తు చేశారు.తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టి రెండో ఏడాది కొంతమందికే అందించారని, అమలు చేసిన కొద్ది పథకాల్లోనూ కోతలేనన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని సైతం కొన్ని బస్సులకే పరిమితం చేయడంతో ప్రయాణికులు కొట్లాడుకుంటున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయన్నారు.అన్నీ బస్సులకు వర్తింపజేస్తే ఈ తరహా వివాదాలకు తావుండదని అన్నారు.వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీకృష్ణ, వార్డు ఇన్‌చార్జ్ రేజేటి కృష్ణవేణి, రేజేటి ఈశ్వరరావు,బుడా మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కావలి సర్పంచ్ మృతి



తమ్మినేని రవీంద్ర నాయుడు(ఫైల్)

సంతకవిటి: మండలంలోని కావలి గ్రామ సర్పంచ్ తమ్మినేని రవీంద్రనాయుడు మృతి చెందారు. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతిపై రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురుగుబెల్లి స్వామినాయుడు, మండల సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు సంతాపం తెలిపారు. ఆదివారం ఉదయం కావలి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడా దుస్తుల వితరణ



ఉపాధ్యాయులు అందించిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

రేగిడి: లింగాలవలస గ్రామ ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు ఆపాఠశాల హెచ్‌ఎం డి.కృష్ణారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, ఏ.తవిటిరావు,బి.ఈశ్వరరావు రూ.10 వేల విలువ చేసే క్రీడా దుస్తులు శనివారం అందజేశారు. సర్పంచ్ గొర్జాన అప్పలనాయుడు, పాఠశాల పీడీ సన్యాసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోవాలాల నిరసన



ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

రామభద్రపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు శనివారం నిరసన రాలీ చేశారు. సాలూరు వైపు ఉన్న ఆటో స్టాండ్ నుంచి స్థానిక గాంధీ బొమ్మ వరకు ర్యాలీగా వెళ్లి గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పాటయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు హామీలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చెప్పారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు.ఏటా రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని, పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టి ప్రభుత్వం మా పొట్టకొట్టిందని, మేము ఉపాధి కోల్పోయామని వాపోయారు. లైసెన్స్ కలిగిన ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.25వేలు చొప్పున ఆర్థిక సాయంతో పాటు, ఆర్‌టీఓ చలానాలు తగ్గించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీఎన్‌ఎస్ 106(1)(2) చట్టం బ్రిటీష్ చట్టాల కంటే కఠినంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 19న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు.ఆటో యూనియన్ నాయకులు చొక్కాపు లోకేష్, సాండి గంగరాజు, రామకృష్ణ, వెంకటేష్,సోములు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో టీడీపీ నేతల పెత్తనం

మెంటాడ: మండలంలో యూరియా పంపిణీలో కూటమి నేతల పెత్తనం ఏమిటని వైస్ ఎంపీపీ ఈశ్వరరావు ప్రశ్నించారు. ఇద్దనవలస రైతు సేవా కేంద్రంలో ఈనెల 28న జరిగిన యూరియా పంపిణీలో టీడీపీ నాయకులు జోక్యం చేసుకోవడంతో రైతులు తిరగబడడంతో అధికారులు జోక్యం చేసుకుని పంపిణీ నిలిపివేశారు. రైతు సేవా కేంద్రం వీఏఏ అక్కడికి వచ్చిన కొంపంగి,ఇద్దనవలస రైతుల ఆధార్, వన్‌బీలను తీసుకుని లైన్‌లో పెట్టి వరుస క్రమంలో టోకెన్‌లు ఇస్తామని చెప్పి ఆరోజు పంపిణీ చేశారు. ఇద్దనవలస గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు శనివా రం రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఇద్దనవలస రైతుల ఆధార్, వన్‌బీలను తీసుకువెళ్లిపోయి, గ్రామంలో టీడీపీ సానుభూతి పరులైన రైతులకు టోకెన్లు పంపిణీ చేశాడు. ఈ సమాచారం అందుకున్న వైస్ ఎంపీపీ ఈశ్వరరావు రైతు సేవా కేంద్రానికి వెళ్లారు. వ్యవసాయ శాఖ ఏడీకి ఫోన్ చేసి టీడీపీ వారికి మాత్రమే యూరియా ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. స్పందించిన ఏడీ తక్షణమే యూరియా పంపిణీ నిలిపివేయాలని వీఏఏకు ఫోన్‌లో చెప్పడంతో సిబ్బంది రైతు సేవా కేంద్రానికి తాళం వేసి వెళ్లిపోయారు. గత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా రైతులందరికీ యూరియా పంపిణీ చేశామని, రైతుల విషయంలో ఇలాంటి రాజకీయాలు మొదటిసారి చూస్తున్నామని వైస్ ఎంపీపీ ఈశ్వరరావు అన్నారు. టీడీపీ నేతలకు చేతనైతే రైతులకు సరిపడా యూరియా తీసుకురావాలని, అంతే కానీ రైతులతో రాజకీయాలు చేయవద్దని సూచించారు.

గంబూషియా చేపపిల్లలతో దోమల నియంత్రణ

బొబ్బిలిరూరల్: దోమల నివారణకు చెరువుల్లో గంబూషియా చేప పిల్లలు విడిచిపెడుతున్నామని డీడీఓ ఎం.కిరణ్‌కుమార్ చెప్పారు. మెట్టవలస గ్రామంలోని ఆచారి బందలో శనివారం గంబూషియా చేపపిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు, చెరువు నీటిలో దోమల లార్వా పెరగకుండా నియంత్రించడంలో గంబూషియా చేపపిల్లలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ పి.రవికుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దళారులను నమ్మి ఎన్‌ఓసీ ఇవ్వొద్దు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని తారకరామాకాలనీ ఎదురుగా ఉన్న శ్రీనివాస జూట్ మిల్లు స్థల యజమానులు మున్సిపాలిటీకి రూ.45 లక్షలమేర పన్ను చెల్లించాల్సి ఉందని, దళారుల మాటలు నమ్మి ఎన్‌ఓసి మంజూరు చేయవద్దని వైఎస్సార్ కౌన్సి లర్లు ఇంటి గోవిందరావు, పాలవలస ఉమామహేశ్వరరావు, సాల రామకృష్ణ కోరారు.మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం విలేకరులతో మాట్లాడారు.దాదాపు 3.5 ఎకరాలున్న ఆస్థలంలో ప్రభుత్వభూమితోపాటు ఏపీఐఐసీకి చెందిన కొంతభూమి ఉందని వివరించారు.మరో 80 సెంట్ల స్థలం కోర్టు కేసుల్లో ఉందని,ఆస్థల యజమానులు మున్సిపాలిటీకి రూ.45 లక్షలమేర పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలను రాబట్టాల్సి ఉందని, కౌన్సిల్ సమావేశంలో చర్చించిన తర్వాతే ఎన్‌ఓసీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

బొబ్బిలిరూరల్: మామిడి రైతులు యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి ఎస్.వెంకటరత్నం సూచించారు. మండలంలోని డొంగురువలస లో రైతులకు మామిడి సాగుపై శనివారం శిక్షణ ఇచ్చారు. కొమ్మల కత్తిరింపు, పునరుద్ధరణ, ఎరువులు, సస్యరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మామిడి సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించారు. క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద జిల్లా మామిడి పంటకు ఎంపికై నందున మామిడి ఆధారిత పరిశ్రమలు, ఉత్పత్తులు పెరుగుతాయని చెప్పారు. ఉద్యానవన శాస్త్రవేత్త రాధారాణి రైతుల సందేహాలను నివృత్తి చేశారు.